**Vaartha, 8th July 2008**

# చిరుధాన్యాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

**పంజగుట్ట, జూన్ 7 ప్రభాతవార్త**

మానవునికి ఎన్నో పోషకాలు అందిస్తున్న చిరుధాన్యాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ జాతీయ కన్వీనర్, మిలెట్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా జాతీయ కన్వీనర్ పి.వి.సతీష్ అన్నారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల చిరు ధాన్యాలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని దీంతో చిరుధాన్యాల కొరత తీవ్రంగా ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ చిరుధాన్యాలపై ఇటీవల రాజేంద్రనగర్‌లో రైతులు, ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సేవాసంస్థలు కలిసి ఒక సెమినార్ నిర్వహించారని ఈ సెమినార్‌లో దేశవిదేశాలకు చెందిన పలువురు వక్తలు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో చిరుధాన్యాల సేద్యంపై పలుతీర్మానాలు చేసినట్లు ఆయన తెలిపారు. పౌరసరఫరాల ద్వారా ఈ చిరుధాన్యాలను సరఫరా చేస్తే రైతులకు ప్రోత్సాహంతో పాటు మంచి రేటు కూడా వస్తుందని దీంతో చిరుధాన్యాలు పండించేందుకు రైతులు ఉత్సాహం చూపుతారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పౌరసరఫరాల ద్వారా ప్రభుత్వం గోధుమ, బియ్యం లాంటి పోషకాలు తక్కువగా ఉన్న ధాన్యాన్ని సరఫరా చేస్తుందని అయితే పోషకాల విలువల ఎక్కువగా ఉన్న మరెన్నో చిరుధాన్యాలు మరుగునపడిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక చిరుధాన్యాల సేద్యం కోసం రైతులకు ఎలాంటి ప్రముఖులు సహకారం లేదని ఇవి వర్షాదార పంటలు కావడంతో వీటిపై ప్రభుత్వం దృష్టిసారించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ చిరుధాన్యాల్లో ప్రపంచవ్యాప్తంగా మన దేశంలో ఎన్నో పోషకాలు లభించే చిరుధాన్యాలు ఉన్నాయని వీటి సేద్యం కోసం రైతులు కృషి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందడం లేదని ఆయన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం చిరుధాన్యాలను పండించే రైతులను ప్రోత్సహించాలని పూర్తి వర్షాదార పంటలైన ఈ చిరుధాన్యాల రైతులను ప్రోత్సహిస్తే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం కూడా పడదని ఆయన తెలిపారు.